కథా నిలయం
4626
శ్రీకాకుళం

# అల్లుడి మంచితనం

ఆరోజు మధ్యాహ్నం అందరం హాలులో కూర్చుని మాట్లాడుకుంటు న్నాము. శనివారం అవటం చేత అక్కయ్యకి స్కూలు లేదు. వర్కింగ్ అవర్స్ లేవని నేను కాలేజ్‌నుంచి వచ్చేశాను. అప్పుడే భోజనాలు ముగించాము.

పోస్టుమేన్ తెచ్చి యిచ్చాడు ఆ ఉత్తరం. నాన్న కవరు విప్పి చదువు కున్నారు. పలుచగా ఒంటి కాగితంమీద నాలుగే పంక్తులు కనిపిస్తున్నాయి. చదువుతుంటే నాన్న ముఖంలో కలవరపాటు ఆవెంటనే గాంభీర్యం కనిపించాయి.

''ఎక్కడినుంచి నాన్నా ఉత్తరం?'' అని ప్రశ్నించాను.

''రాత్రి మెయిల్లో బావ వస్తున్నాడట'' అన్నారు నాన్న.

''ఏ బావ?'' అని అడిగాను. ఇద్దరు బావలు ఉండటం వలన ఆ ప్రశ్న వేయవచ్చు. కాని పెద్దబావకి మాకు ఐదేళ్ళనుంచి రాకపోకలు, ఉత్తర ప్రత్యుత్తరాలు లేవు కనుక ఆ ప్రశ్న వేయనవసరం లేదు. చిన్నబావ అనుకోవచ్చు. కాని నాన్న ముఖంలో సంచలనం చూస్తే ఆ ప్రశ్న వచ్చింది.

''రఘుపతి'' అని చెప్తుంటే నాన్న గొంతుకలో బాధ ధ్వనించింది. అక్కయ్య ముఖం తెలతెల్లబోయింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

''అదేమిటమ్మా లలితా! ధైర్యంగా ఉండాలి. మనకి మంచి కలుగుతుందనే ఎదురు చూడాలి'' అన్నారు నాన్న.

అక్కయ్య లోపలికి వెళ్ళి గదిలో తలుపు వేసుకుని పడుకుంది. అమ్మ, నాన్న మాట్లాడుకోవలసిన విషయాలు ఉంటాయేమోనని తోటలోకి వెళ్లాను నేను.

తోట అంటే రాజకుమార్తెలు విహరించే ప్రమదావనం కాదు. మానాన్న మేము అక్కాచెల్లెళ్లం నలుగురం, మా తమ్ముళ్ళిద్దరూ - అందరం కలిసి ప్రేమగా

పెంచుకున్న ఇంటిచుట్టు ఉన్న చిన్నతోట. నాన్న ఒక జమీందారనికాని, మేము రాజకుమార్తెలమని కానీ చెప్పను కానీ, మేము ముద్దుగా పెరిగాము. ఐదేళ్ళ తరువాత బావ ఎందుకు వస్తున్నాడో? ఎండగా ఉండటం చేత వెళ్ళి జామచెట్టు నీడలో నుంచున్నాను.

ఆ సంక్రాంతికి లలితక్కయ్య వస్తుందని నేను సత్య ఎంతో సంతోషపడుతున్నాము. చిన్నక్కయ్య సత్య అదే మొదటిసారి అత్తవారింటికి వెళ్ళిరావటం. పండగకి ముందరే వచ్చింది. పండగనాటికి బావలిద్దరూ వస్తారు. తమ్ముళ్ళతో కలసి బావల నెట్లాగ ఎగతాళి చేయటమా అని ఆలోచిస్తున్నాను. నాన్న వెళ్ళి లలితక్కయ్యని తీసుకు వచ్చారు. బండి దగ్గరికి పరిగెత్తాము. అక్కయ్యని చూసి అమ్మకళ్ళలో నీళ్ళు తిరుగుతుంటే ''చిక్కిపోయావే'' అంది. లలితక్కయ్య ''ఊ'' అని ఊరుకుంది.

ఎవరితోనూ ఎక్కువ మాట్లాడదు. అడిగిన దానికి ముభావంగా సమాధానం చెప్తుంది. పరధ్యానంగా ఉండి నిట్టూర్పులు విడుస్తూంటుంది. నలుగురి మధ్య ఉన్నా ఎవరినీ గుర్తించినట్లే ఉండదు. అమ్మనాన్నతో అంది, ''లలిత ఏమిటో అట్లాగ తయారయింది. దానికి మనసులో ఏదో బెంగ ఉంది'' అని.

పండగ రేపనగా చిన్న బావ వస్తాడని చూస్తున్నాము.

''రఘుపతి ఎప్పుడు వస్తానన్నాడే. ఉత్తరం ఏమైనా వచ్చిందే నువ్వు వచ్చాక?'' అని లలితక్కయ్య నడిగింది అమ్మ. ఈసారి లలితక్కయ్య మౌనం వదలి, ''ఆయన పండగకి రారమ్మా. నేను మళ్ళీ అక్కడికి రానని చెప్పి వచ్చేశాను'' అంది. అమ్మ నిర్ఘాంతపోయింది. చిన్నక్కయ్య లలితక్కయ్య ముఖంలోకి చూస్తూ ఉండిపోయింది.

లలితక్కయ్య వెంటనే తలదించుకుని ''అంటే రానని కాదు. ఎంత సర్దుకుపోదామనుకున్నా సానుభూతిలేని ప్రవర్తనను, అర్థం చేసుకోలేని స్వభావం నా మనసును సరిపెట్టుకోలేకపోయానమ్మా. చెప్పి చూశాను. లాభం లేకపోయింది. మారితే కాని ఉండలేనని మా అమ్మావాళ్ళ దగ్గర ఉంటాననీ చెప్పి వచ్చేశాను'' అంది. అమ్మ మాట్లాడలేదు. నాన్న ఏమీ అనలేదు. సత్య మాత్రం అంది!

''నువ్వు తొందరపడ్డావు'' అని.

''ఎట్లా చెప్పగలవు?''

''పెళ్ళి అయి అత్తవారింటికి వెళ్ళేది మనం. అక్కడ పరిస్థితులకు అలవాటు పడవలసినది మనం కాని వాళ్ళు కాదు. ఆడపిల్లలకు అది కష్టంగానే ఉంటుంది కాని అది సహించగలిగి ఉండాలి''.

''నీకు తెలియదు సత్యా. సహిస్తాను. ఆ ఓపిక నాకూ ఉంది. కాని ఫలితం ఏమిటి? ఆ స్వభావం మారుతుందనే ఆశలేదు. జీవితమంతా వృధా అయిపోవటం లేదూ. నేను నా జీవితంలో ఏదీ పోగొట్టుకోదలుచుకోలేదు. దాపరికమెందుకు? అక్కడ జరిగిన కథలన్నీ చెప్తాలే రాత్రి'' అంది లలిత.

రాత్రి కోసం అందరం ఎదురుచూస్తున్నాము. అప్పుడు నాకు పధ్నాలుగు ఏళ్ళు ఉంటాయేమో. కాని అక్కయ్య విషయంలో ఏదో కుతూహలం. లలిత సన్నగా, నాజూగ్గా ఉండి, ఎంతో అందంగా ఉండేది. తలలో జాజులు పెట్టుకుని కాటుక కళ్ళతో అక్కయ్య నవ్వుతుంటే అక్కయ్యలాగా ఎప్పుడు ఎదుగుతానా అని తహతహగా ఉండేది. జామ చెట్టుకింద కూర్చుని ఎన్నో కథలు చెప్పేది అక్కయ్య. బావతో ఎందుకు పోట్లాడి వచ్చింది లలిత? నా మనసులో ఎంతో ఆశ్చర్యంగా ఉండేది? అక్కయ్య కలలు కన్న రాజకుమారుడు కాదూ బావ!

వరండాలో చాప వేసుకుని తలకింద దిండుపెట్టుకుని పడుకుంది అమ్మ. నాన్న పడక కుర్చీలో మేను వాల్చారు. తమ్ముళ్ళు చెల్లి పడుకున్నారు. లలితక్కయ్య అమ్మ దగ్గర కూర్చుంది మోకాళ్ళమీద తల ఆనించుకుని. సత్యా అమ్మతలవైపు కూర్చుని ముంగురులు సర్దుతోంది. అమ్మ పక్కన పడుకుని నేను వింటున్నాను.

''ఆయన నాయెడల కఠినంగా ఉన్నారని కాదు''. అది ఒక రకమైన స్వభావం. అందరి స్వభావాలు ఒకలాగ ఉండవు. కలిసి ఉండవలసిన అవసరం వచ్చినప్పుడు కొంతవరకూ సహించక తప్పదని మనసుని సమాధాన పరచాలనుకునేదాన్ని. కాని ఆయనకు ఈ ఉద్దేశం లేకపోవటంవలన అది నాకు సాధ్యం కాలేదు.

మనం తినటానికి ఒక వస్తువు కొనుక్కొంటాము. తినేటప్పుడు దాని రుచి మనసులో పెట్టుకుంటే ఆనందం. కాని దాని వెల రూపాయి. రూపాయి ఖరీదుగల వస్తువుని మనం తింటున్నాం అనుకుని తింటుంటే దానిలో ఉండే ఆనందం సహజమైంది కాదు.

మనం మాత్రం జమీందారులమేమిటమ్మా? కాని మా పెంపకం వేరు. పొరపాటున కొబ్బరినూనె ఒలికితే ''అయ్యో ఒలికిందా తల్లీ, క్రిందపడింది తలకి

రాసుకోకే,' అంటావు నువ్వు. ఆయన ప్రతీదీ రూపాయణాలలో లెక్క కడతారు. నూనె తెచ్చారు. నాకు వాడటం చేతకాదేమో, ఇరవై రోజులు వచ్చింది. నెలలోపల మళ్ళీ తీసుకురారట. తరువాత నెల తగ్గించి రాసుకోవటం మొదలుపెట్టాను. ఒకరోజు ''ఏమిటా జుట్టూ నువ్వూను. తలదువ్వుకోవటం చేతకాదా?'' అన్నారు. కొబ్బరినూనె చేతిలో వేసుకుంటుంటే ఒలికింది. అది రెండురోజులకి వచ్చేదికదా అనిపించింది. ఉండి కూడా ఈ పేదరికమేమిటి? నాకు కూడా ఈరకపు దృష్టి అలవడిందే అని కళ్ళలో నీరు తిరుగుతుండగానే నవ్వు వచ్చింది. ఎంత తిన్నా, ఎంత అనుభవించినా ఏదో పేదరికంలో ఉన్నట్లుంటుంది కాని మనసుకు తృప్తిగా ఉండదమ్మా?''

''అది కాదే లలితా ఇంత ఖర్చు అవుతుంది. ఇది కావాలని చెప్పాలి,'' అంది అమ్మ.

''చెప్పినా లాభం లేదమ్మా. తగ్గించాలంటారు''.

''అంత సంపాదిస్తాడు. ఏం చేస్తాడే? నీకు ఖర్చుకు ఇవ్వడా?''

''నాకే స్వతంత్ర్యం లేదుకాని, ఏ లోటు వచ్చినా తప్పు నాది. నేనారకంగా సంసారం చెయ్యలేనమ్మా. వారి దృష్టిలో నేను ఒక చేతకానిదాన్ని''. అక్కయ్య చెంపలు కన్నీళ్ళతో తడిసి మెరుస్తున్నాయి. ఎన్నాళ్ళనుంచి గడ్డకట్టిన దుఃఖమో అది.

''పిచ్చిదానా! కొబ్బరినూనె రాసుకోవటం మానుకుంటారుటే''.

''మరి వాళ్ళ డబ్బంతా నేను తింటున్నానని బాధపడుతుంటే''.

ఈసారి అమ్మ మాట్లాడలేదు. సత్య మెల్లగా అంది.

''అభిమానానికి పోతే అట్లాగే కనిపిస్తుంది నీకు. అనుభవం లేక దుబారా చేస్తావని కొంచెం జాగ్రత్తగా ఉంటాడేమో. భార్యవయ్యాక నీవు పరాయిదానివా. తినక తప్పుతుందా?''

''అది వాళ్ళకి తోచాలికదా'' అని ''ఛీ'' అనుకుంది లలితక్కయ్య.

''ఏమోనమ్మా, పిల్లవాడు బాగున్నాడు. ఇంత ఆస్తికూడా ఉందని ఆశపడి పిల్లనిచ్చాము'' అని భారంగా అంది అమ్మ.

కొంతసేపు మౌనంగా గడిచాక

''నేను పుస్తకాలు చదువుకోకూడదు. నవలలు చదివితే పాడయి పోతారట. ఎదురు తిరుగుతారట. ఆరోజు ఏదో పుస్తకం చదువుకుంటున్నాను ఏమీ తోచక. ఇంటికి వచ్చారు. నేను చూడలేదు. చప్పున చేతిలో పుస్తకం

లాగారు. లాగటంలో అది చిరిగింది. నాకు కోపం వచ్చింది. అది పద్మ పెళ్ళికి కానుకగా ఇచ్చిన పుస్తకం''.

''ముందు పుస్తకం ఇవ్వండి'' అన్నాను.

''పుస్తకాలు చదవవద్దనలేదా? చింపి పారేస్తాను'' అన్నారు.

''ఇది చౌకరకం పుస్తకం కాదు. కావ్యం అనిపించుకోతగిన తెలుగు నవల. నా స్నేహితురాలు ఇచ్చిన పెళ్ళికానుక. ముందర ఇవ్వండి'' అన్నాను గంభీరంగా. ఆయన ఇచ్చి వెళ్ళి ఉంటే నేను పశ్చాత్తాపపడి ఉండేదాన్ని. కాని ఆయన, ''నీకు నీ స్నేహితురాలు ఎక్కువా? నేనా?'' అని ప్రశ్న వేశారు. అసహ్యం వేసింది.

''మీకు మీ విలువ తెలీదు. ఆపుస్తకం విలువ తెలీదు. స్నేహం తెలీదు'' అన్నాను. కోపం వచ్చింది. ఆరోజంతా నాతో మాట్లాడలేదు. కోపం పోగొట్టాలని ''మరి తీరిక సమయాలలో ఏం చెయ్యమంటారు?'' అనడిగాను.

''ఆవును కొంటారుట. పాడి చెయ్యాలిట. ఇంకా తీరిక ఉంటే కుట్టుమిషను కొంటారుట. ఏ పనిచేసినా ఉపయోగకరంగా ఉండాలిట. అంతేకాని మనోవికాసానికి విలువలేదు వారి దృష్టిలో. ఆ మాటలు తలుచుకుంటుంటే మనసు విరిగిపోతుంది. నాన్న నన్ను ఎందుకు చదివించారా? నాకు ఆ ఆశలన్నీ ఎందుకా అని ఒకటే బాధగా ఉంటుందమ్మా. జీవితాన్ని గురించి ఆశయాలు లేవు ఆయనకి. వెన్నెలను చూస్తే నేను పాట పాడుకోవలసిందే. జీవితాన్ని తీయని కావ్యంలాగా గానం చేస్తూ గడపాలని ఆశాసౌధాలు నిర్మించుకున్నా ఇప్పుడయినా నా ఆశయాలకు విరుద్ధంగా జీవించి నాలో ఉత్సాహాన్ని అణచివేసుకోవటం నాకిష్టం లేదమ్మా. వచ్చే మార్చికి ఇంటర్ పరీక్షకి అప్పియర్ అవుతాను. చదువుకుంటాను'' అంది లలిత.

అమ్మ, నాన్న మాట్లాడలేదు.

''జీవితంతో చెలగాటమాడితే ఎట్లాగ అక్క? నువ్వు పట్టింపులకు పోవలసినంత కారణం ఏమీలేదు. మెల్లగా అలవాటు పడాలి అతని స్వభావానికి. నువ్వు మనసు విప్పి చెప్తే అతను మాత్రం నీమాట కాదనగలడా? నీ సంగతి ఆలోచించుకుని నువ్వు అమ్మ, నాన్న దగ్గర ఉంటానన్నావు కాని, ఇంకా ఇద్దరు చెల్లెళ్ళకు పెళ్ళికావాలి. వాళ్ళ పిల్లలు సంసారం చెయ్యరనే చెడ్డపేరు మనకి వస్తుందని ఆలోచించావా!'' అంది సత్య. లలితక్కయ్యకి కోపం వచ్చింది.

''వాళ్ళు ఇటువంటి పెళ్ళిళ్ళు అసలు చేసుకోనే చేసుకోరు. నేను తెలియక ఒప్పుకున్నా అప్పుడు. కాని ఒకళ్ళకోసం నేను సర్వనాశనం కావటానికి నేను

చచ్చినా ఒప్పుకోను'' అని లేచి గదిలోకి వెళ్ళిపోయింది. నాన్న వెనుకనే వెళ్ళారు. ఏడుస్తూ పడుకున్న లలిత తల నిమురుతూ, ''ఏం చేసినా మీరు సుఖపడాలనే చేస్తాం తల్లీ! నీకు చదువుకోవాలని ఉంటే ఇక్కడే ఉండి చదువుకోమ్మా. నేను వద్దంటానా?'' అన్నారు.

''ఇదంతా నేను ఈరెండేళ్ళనుంచీ అనుభవిస్తున్న బాధ నాన్నా'' అంది దిండులో తలదూర్చి ఏడుస్తూ లలితక్కయ్య!

''మనసులు కలవలేదు తల్లీ! అంత మాత్రానికే బంధాలు తెంపుకోలేమమ్మా'' చటుక్కున అక్కయ్య లేచి కూర్చుంది.

''అది నాకు తెలుసు నాన్నా! నేను చాలా సాహసం చేసి వచ్చానని కూడా తెలుసు. కాని ఇది వారిలో ఏమైనా మార్పు తెస్తుందేమోనని నా ఆశ. అదే చెప్పి వచ్చాను నేను'' అంది.

ఆ తరువాత అక్కయ్య ఏడుస్తూనే ఉంది. నాన్న మాట్లాడకుండా తలనిమురుతూ ఉండిపోయారు. ఇప్పుడు తలచుకుంటే నా కంఠం గద్గదిక మౌతోంది.

* * *

చిన్నక్కయ్య సత్య చాలా చిత్రమైన మనిషిలా కనిపిస్తుంది నాకు. లోపల ఏ కోరికలు ఉంటాయో, ఏ ఊహలు మెదులుతుంటాయో తెలియదు. ఏ పరిస్థితులలోనైనా గంభీరమైన చిరునవ్వుతో ఉంటుంది. సత్యను చూస్తే మెచ్చుకోబుద్ధి వేస్తుంది కాని, నేను మాత్రం అట్లగ ఉండలేను. ప్రతివిషయం నన్ను నిలువునా కదలించి వేస్తుంది. నాలో భావోద్రేకం కట్టలు తెంచుకుంటూ ఉంటుంది. పండగలు అయ్యాక అందరితో సరదాగా ఇంకొక రెండురోజులు గడపాలని ఉన్నప్పటికీ బావ రమ్మన్నాడని వెళ్ళిపోయింది సత్య. తన మనసులో మాట చెప్పదు. బావకి ఎదురు పలుకదు. బావచేసే అధికారం చూస్తే కోపం వస్తుంది. ఇవన్నీ ఎందుకు సహిస్తుంది సత్య? అడిగితే ''అది నా స్వభావమే. నేనేమీ ఆలోచించను' అంటుంది. నిజమే. ఈ నాలుగేళ్ళలో చిన్నబావ చాలా మారాడు. మొదట బావ ఇంటి యజమాని. పెత్తనమంతా అతనిదే. అతను కొని తెచ్చిన చీర రిమార్కు లేకుండా కట్టుకునేది సత్య. ఇప్పుడు సత్య ఆ ఇంటికి రాణి. ఫలానా చీర బాగుంది అంటుంది. ''కొనుక్కో'' అంటాడు బావ.

''నీకెందుకు ఆ విషయాలు'' అని కసురుకునే బావ, ఇప్పుడు ప్రతి విషయం గురించి సత్యతో సంప్రదిస్తాడు. సత్యకి చెప్పనిదే ఏ పని చెయ్యడు. ''అంతకంటే ఏమి కావాలి ఆడవాళ్ళకి'' అంటుంది సత్య.

ఇద్దరు పిల్లల తల్లి అయ్యాక సంగీతం కూడా మొదలుపెట్టింది. పెళ్ళితో ఆ చదువు చాలని ఆపించిన బావ, ఇప్పుడు మేష్టరుని పెట్టి సంగీతం నేర్చుకోవాలనే సత్యకోరికను తీరుస్తున్నాడంటే ఆశ్చర్యంగా ఉంటుంది. ఇదంతా సత్య బావలో తీసుకువచ్చిన మార్పు కాబోలు. కాని లలితక్కయ్య తప్పు చేసిందని నాకు అనిపించదు. చిన్నబావలాగ అందరూ మారతారని ఎట్లా చెప్పగలం! అయినా మధురంగా గడపవలసిన కాలమంతా నిర్జీవంగా వృథా అయిపోవటం లేదూ. అక్కయ్య అన్నట్లుగా అందరూ బ్రతుకుతారు ఎట్లాగో ఒకలాగ. కాని సంస్కృతి అంటూ ఉంటే జీవితాన్ని కళాత్మకంగా చేసుకుని ఆనందించాలి. లలితకి ఆ చిన్న వయసులోనే అన్ని భావాలు!

బావ ఊహకి ఆ లోతులు అందవు. లలిత కోపంగా కాని, ముభావంగా కాని ఉంటే ''కొత్తచీర కావాలా? ఆడవాళ్ళు అలిగేది ఇందుకే కదా'' అంటాడుట.

అక్కయ్య మూడవ కథ చెప్పింది.

''ఆరోజు ఇద్దరు స్నేహితుల్ని తీసుకువచ్చారు. లోపలికి వచ్చి, ''ఒక గంట ఉంటారు. త్వరగా ఒకస్వీట్, హాట్, కాఫీ తయారు చెయ్యాలి'' అన్నారు. ఫలహారం కాఫీ తయారు చేశాను. లోపలకు వచ్చి ''కొంచెం మొహం కడుక్కొని, ఫలహారాలు తీసుకురా'' అని వెళ్ళారు. ఫలహారాలు అందించి అక్కడే కూర్చున్నారు.

వాళ్ళు చిన్ననాటి స్నేహితులు. సరదాగా మాట్లాడుకుంటున్నారు. నాకు కొత్తగా ఉంది: ''అట్లా ఉన్నావేం?'' అని వాళ్ళతో ''మా ఆవిడ స్కూల్‌ఫైనల్ చదివిందన్నమాటేగాని బోలెడంత సిగ్గు'' అన్నారు.

ఆయన మైసూర్‌పాక్ అప్పుడే నోటిలో పెట్టుకున్నారు. ''ఏమిటి ఇట్లా ఉంది. నెయ్యి చాలలేదు. అయినా ఎవరైనా వస్తే మరీ పాడుచేస్తావు'' అన్నారు. నేనేమైనా కావాలని పాడు చేస్తానా? పదేళ్ళనుంచీ కాపురం చేస్తున్నానా వంటల్లో ఆరితేరటానికి. నాకు ఈపనులన్నీ కొత్త అనే సానుభూతి ఆయనలో లేదు. నా మనసులో బాధ వేసింది.

''అట్లాగనకు రఘూ. ఉప్మా చాలా బాగుంది. ఇంకా కొత్త చూడు'' అన్నారొకాయన. నాకు కళ్ళలో నీరు తిరుగుతుంటే కాఫీ చెయ్యాలని వచ్చేశాను. ఎంతసేపటికి నేను కాఫీ తీసుకువెళ్ళలేదని ఆయన వచ్చారు. ''నేను తీసుకురాను. మీరు తీసుకు వెళ్ళండి'' అన్నాను.

''ఏం సిగ్గా? చదువుకున్నదానివి సిగ్గెందుకు?'' అన్నారు.

''వాళ్ళముందర మీరనేమాటలు పడలేను'' అన్నాను రోషంతో. కాని నా మనసెట్లాగుందో, నేనే పరిస్థితిలో ఉన్నానో ఆయన ఏమీ గుర్తించలేదు. వాళ్ళతో కలిసి సినిమాకు వెళ్ళారు. అంతే, నా ఆలోచన ఆయనకు ఎప్పుడూ ఉండదు.

ఒకసారి జ్వరం వచ్చింది. హోటల్లో భోజనం చేసేవారు. లేవలేని పరిస్థితి వచ్చేదాకా నేనే వంటచేశాను కాని, ''వంట చెయ్యగలవా?'' అని అడగనైనా లేదు.

జ్వరం నార్మల్‌కు వచ్చింది. నాలుగురోజుల నుంచీ ఆహారం లేకపోవటం వలన నీరసంగా ఉంది.

''అకలివేస్తోందా?'' అనడిగారు. ''ఊ'' అన్నాను.

''నార్మల్‌కి వచ్చిందిగా. పథ్యం తినొచ్చు'' అని వెళ్ళిపోయారు. హోటల్‌కి వెళ్ళి, ఆఫీసుకి వెడతారు. సాయంత్రం వస్తారు. నేను పథ్యం తినాలి. వండుకోవాలి. మంచం మీద నుంచి లేవటానికేనా బలం లేదు. అమ్మ గుర్తుకు వచ్చింది. ప్రేమ అంటారు. ఏమిటి ప్రేమ, అందంగా, ఆరోగ్యంగా ఉన్నప్పుడు సరదాగా కబుర్లు చెప్పుకోవటమా, షికారుకి వెళ్లటమా? లేక ఆ పేరు చెప్పి అవసరాలు తీర్చుకోవటమా?

జ్వరం వచ్చిన మరునాడు డ్రెస్ అవుతున్నారు పొద్దున్న దగ్గరకు వచ్చి ''అంత ఎక్కువ లేదనుకుంటాను'' అన్నారు. ''అహ'' అన్నాను, వారి ప్రయత్నం తెలుసు కనక. ''అంటే మరేమీ భయపడనవసరం లేదు లలితా!'' అన్నారు. ''ఎందుకూ భయం!'' అన్నాను, విరక్తిగా నవ్వుతూ. ''మరి మంచి ఇంగ్లీష్ పిక్చర్. ఒక్క షో మాత్రం ఉంది. వెళ్ళకపోతే ఇంక చూడలేను. ఏమీ అనుకోవుకదూ''. ''నేనేమనుకుంటే మీకు ఏమిటి?'' అని అన్నాను. ''అట్లాగయితే నేను వెళ్ళను'' అన్నారు. అట్లాగే బలవంతంగా ఆపటం నాకూ ఇష్టం లేదు. ''ఏమీ అనుకోను వెళ్ళండి'' అన్నాను. ''నాకు తెలుసు. నువ్వు మంచిదానివి లలితా'' అన్నారు. ఆ పొగడ్త నాకు సంతోషం కలిగించలేదు. వెళ్ళబోతూ, ''ఒక్కమాట, ఎవరేనా వస్తే సినిమాకి వెళ్ళానని చెప్పకు బాగుండదు'' అన్నారు.

ఆయన వెళ్ళిపోయారు. పడుకుని ఉన్న నాలో అనేక ఆలోచనలు వేధించసాగాయి. చివరికి ''ఔను ఏదో మామూలు జ్వరం. అదే తగ్గిపోతుంది. కనుకనే నన్ను వదలిపెట్టి ఆయన వెళ్ళగలిగారు. విషయం ఇంత చిన్నది కదా అంత బాధపడటమెందుకు? ప్రతిదానికి ఆయన ప్రవర్తనలో లోపాలు వెతుకుతుంటే మనసుకి శాంతి కూడా ఉండదు. నిజమే నాకు జ్వరం వచ్చిందని

సెలవు పెట్టారు కాని, ఇంట్లో తోచలేదు. అందుకని వెళ్ళారు'' అని మనసును సరిపెట్టుకున్నాను.

కాని ఈరోజు అదంతా గుర్తుకు వచ్చింది. ఆయనకి నామీద నేననుకునేటంత మమకారంలేదేమో అనే శంకతో మనసు వికలమయింది. పక్క ఇంటి ఆవిడ చూడటానికి వచ్చింది.

''ఎట్లాగ ఉందమ్మా లలితా?'' అంది.

''జ్వరం తగ్గిందండి'' అన్నాను.

''నీరసంగా ఉన్నావు. పథ్యం ఎప్పుడు తింటావు? పోనీ బ్రెడ్ తీసుకోవచ్చుగా'' అని ఆవిడ అంటుంటే నాకు మరీ దుఃఖం వచ్చింది.

''పథ్యం తినమని ఆయన ఆఫీసుకి వెళ్ళారు'' అన్నాను.

''ఎట్లా తింటావనుకున్నాడమ్మా. పోనీ నాకు కబురు చెయ్యకపోయావా? ఉండు, మా కుర్రవాడిని పంపిస్తాను. కాస్త బ్రెడ్ తింటే ఓపికైనా వస్తుంది'' అని ఆవిడ వెళ్ళింది.

ఈ ఆదరణ ఆయన చూపిస్తే నాకెంత ఆనందంగా ఉంటుంది!

సాయంత్రం ఇంటికి వచ్చారు.

''ఆలస్యమయిందనుకుంటున్నావా? అయ్యర్ హోటల్‌కి వెళ్ళి వచ్చాను. మసాలా దోసె చాలా బాగుందిలే. ఎట్లాగూ నువ్వు ఫలహారం చెయ్యలేవు ఇవేళ'' అన్నారు.

నేనేమీ మాట్లాడలేకపోయాను. ఎందుకో కాని అసహ్యం వేసింది. నామీద నాకే విరక్తి కలిగింది.

''అన్నం తిన్నావా?'' అనడిగారు. ''ఆ'' అన్నాను.

''అయితే ఇంక హోటల్‌కి వెళ్ళనవసరం లేదు'' అన్నారు.

ఆయన స్వభావం అంత; నేనంటే ఇష్టమే అని మనసును తృప్తి పరచుకోవాలని ప్రయత్నించేదాన్ని. కాని ఇటువంటి చిన్న విషయాలలో నాకు ఏమీ తృప్తి దొరికేది కాదు. నన్ను నేను మోసం చేసుకుంటున్నామో అనిపించేది.

నాకు తెలుసు లలిత బావను గురించి ఎట్లా ఊహించుకుందో! కథలో నాయకుడు రాజకుమారిని ఆరాధించి ప్రేమించినట్లు తనను చూసుకోవాలని. జీవితాన్ని తీయని కలలాగ చేసుకోవాలని. కాని బావ లోకంలో మనిషి. లలిత సరిపెట్టుకోలేదు. అతడి ప్రతిపనిని, మాటని త్రాసులో వేసి తూస్తుంది. అక్కయ్యకి నిరాశే మిగులుతుంది.

''అక్కడికి వెళ్ళాక నాకు ఒకటైనా ఉత్సాహకరమైన విషయం కనిపించలేదు. పదహారేళ్ళకే నా జీవితమంతా ముగిసిపోయిందా అని నాకు బాధతోచి ఏడుపు వస్తొంటుంది'' అంది.

సత్యకి మాత్రం కోరికలు లేవా? చిన్నప్పుడు మా అందరిలోకి సత్య చాలా చురుకుగా ఉండేది. అందరితో కలిసి మెలిసి ఉండాలనే స్వభావం. సంగీతం అంటే ప్రాణం దానికి. తన స్నేహితురాలు ఒకమ్మాయి స్కూలులో టీచర్‌గా పనిచేస్తుండేది. ఒకరోజు జ్వరం వస్తే ఆ పిల్లని చూడటానికి వెళ్లింది. బావ ఇంటికి వచ్చాక చెప్పిందట.

''ఎందుకు వెళ్ళావ్?'' అన్నాడు బావ. చిన్నక్కయ్య మళ్ళీ ఎవరింటికీ వెళ్ళలేదు ఒంటరిగా.

ఇప్పుడు బావ అంటాడు : ''మనం సంఘజీవులం. అందరితోపాటు సోషల్‌గా ఉండాలి. ఎక్కువేమిటి? తక్కువేమిటి? అందరం మనుష్యులమే. ఎవరి ఆత్మగౌరవం వాళ్ళకి ఉంటుంది'' అని ఇద్దరూ కలిసి స్నేహితుల ఇళ్ళకి వెడుతూ ఉంటారు.

మానవులమై పుట్టినందుకు ఆధిక్యత ఏమిటి? ఈ సృష్టిలో ఇతర జంతువులకు లేని మనసు, ఆత్మలను భగవంతుడు మనిషికి ఇచ్చినందుకు సార్ధకత ఏమిటి? ఔన్నత్యం కోసం నిరంతర కృషి చేయటమే జీవితోద్దేశం! అటువంటిది ఏ అన్వేషణాలేని జీవితం గడుపుతుంటే వేదన కలిగేది. నా జీవితం పతనమయిందనే దుఃఖం కలిగేది. ఎట్లాగ నన్ను ఉద్ధరించుకోవటం అని ఆలోచిస్తుండేదాన్ని'' అంది లలిత.

''నీకు ఏం తక్కువ చేశానని అట్లాగ దిగులుగా, నిరుత్సాహంగా ఉంటావు'' అనడిగాడట బావ.

''ఏమో నాకు తెలియదవు. జీవితంలో ఎప్పుడు శోధించి సంపాదించవలసినదేదో ఉందనిపిస్తుంది నాకు'' అని లలిత అంటే బావ వెటకారంగా నవ్వి, ''అయితే అన్వేషణకు బయలుదేరు'' అన్నాడుట.

చాలాసేపటివరకు ఏమి మాట్లాడాలో లలితకు తెలియలేదు. ఆ వెటకారం వలన కలిగిన బాధ అణిగిపోయాక, ''నా అన్వేషణలో మీకు కుతూహలమేమీ ఉండదా?'' అందిట.

''ఉండదు. నువ్వు తెలివైనదానివి. మాకు ఆత్మ, మనసు లేవు.

''నాకు ఎంత అశాంతిగా ఉందో మీకు తెలుసా?''

''తెలుసు. నాకు కలిగే అశాంతివలన తెలుస్తోంది'' అన్నాడుట బావ.

''ఔనేమో, నా ధర్మాన్ని నెరవేర్చలేక పోతున్నానేమో. కొన్నాళ్ళు అమ్మానాన్నా దగ్గర ఉంటాను. నా బాధని మీరు ఎప్పటికైనా అర్థం చేసుకుంటే నేను కోరుకునేది మీ దగ్గరకు రావాలనే'' అందిట లలిత.

* * *

ఆరోజు పొద్దున్న వరండాలో కూర్చుని నాన్న 'గీత' చదువుతున్నారు. అక్కయ్య కాఫీ తీసుకుని వచ్చింది.

''ఇంకా ఒక శ్లోకం ఉందమ్మా. కాఫీ వేడిగా ఉందా?''

వేడిగా ఉందని చెప్పి అక్కడే కూర్చుంది లలిత. నాన్న కాఫీ త్రాగాక హటాత్తుగా ప్రశ్నించింది.

''వివాహవేళలో భార్యభర్తలమధ్య జరిగే ప్రమాణమేమిటి నాన్నా?'' అని.

అక్కయ్యకి పదహారవయేట పెళ్ళి జరిగింది. ఆ వయసులో వివాహానికి అర్థం తెలియదు. తాము ఏమని ప్రమాణం చేస్తున్నామో తెలియకుండానే ప్రమాణం చేస్తారు. లేకపోతే వివాహాలు దుఃఖాంతాలు ఎందుకవుతాయి. నాన్న శ్లోకం చదివి విపులంగా చెప్తున్నారు.

''సరే నాన్నా! భర్త సంతోషసం కోసం సుఖదుఃఖాలలో సమంగా వర్తిస్తుంది భార్య. మరి భార్యయొక్క ఆనందం భర్త విధి కాదా నాన్నా? విడిచి ఉండనని ప్రమాణం చేస్తారు. కాని, భార్య అంటే శ్రద్ధ ఉండదు. ఆమె ఉన్నతిని చూస్తే అసూయ. ఇంక అతనిలో ఏ మార్పయినా వస్తుందనే ఆశకూడా ఉండదు. ఆ పరిస్థితిలో కర్తవ్యం ఏమిటి నాన్నా? సరే. అన్నీ సహించి అతనిదగ్గరే పడి ఉంటాననుకుందాము. ఫలితమేమిటి నాన్నా? అతనిలో జాగృతి కలుగదు. జీవితమంతా ఆ విధంగా మరుభూమిలో ఇంకిపోవలసిందేనా? అంతకంటే నా తృప్తి కోసం ఇతర కలాపాలలో జీవితం గడపటం తప్పా? మనసు లేనిదే జీవితాన్ని అర్పించలేముకదా. నాటకం దేనికి నాన్నా? మనసులో ఎంతో ఘర్షణ జరుగుతుండేది. వచ్చేశానా, ఇప్పుడు పొరపాటు చేశానేమో అనిపిస్తుంది''.

''ఎందుకమ్మా అట్లాగనుకుంటావు.'' లలిత మనసులో బాధ నాన్నకి తెలుసు. ఆయన లోలోపల కరిగిపోతుంటారు.

''స్వార్థం చూసుకుని ధర్మం విడిచి వచ్చాను. నా ధర్మం నిర్వహించగల నిగ్రహం, ఔన్నత్యం నాలో లేవని నాకిప్పుడు అనిపిస్తుంది నాన్నా! వారు

ఎట్లాంటివారైనా సరే సహించి, ఉన్నతో అథోగతో జీవితం అక్కడే అంతం కావటం మేలనిపిస్తోంది. మళ్ళీ వెళ్ళటం అనేది జరిగితే నేను నేర్చుకోవలసింది ఇదే నాన్నా''.

శరత్ 'అన్నదా' గుర్తు వచ్చింది. అది చదివినప్పుడు వాళ్ళుంటారా అని నవ్వుకున్నాను. కాని లలితమాటలు నన్ను నిలువునా కదిలించివేశాయి. కన్నీళ్ళు తిరిగాయి.

బావ ఉత్తరాలు రాసేవాడు కాదు. అక్కయ్య తనంతట తను వచ్చేసింది కదా, బావ ఎందుకు రాయాలి! లలిత చదువుకుంటుంది అని నాన్న ఉత్తరం వ్రాస్తే దానికి బావ జవాబేమీ వ్రాయలేదు. ఇప్పటినుంచి ఉత్తర ప్రత్యుత్తరాలు లేవు. కాని లలిత బావ సంగతులు ఏమైనా తెలుస్తాయేమోనని ఎదురు చూస్తుండేది. లోపల లలితకి బావ అంటే అంత ప్రేమ ఉంది. రాజకుమారుని రాజకుమారుడు తన ముద్దుతో మేల్కొలిపాడు. తన ఎడబాటుతో బావలో మేల్కొలుపు తీసుకు రావాలని అక్కయ్య దీక్ష.

లలిత పేపర్ చదువుతుంటే,

''అబ్బో, పేపర్ చదువుతున్నారు రాణీగారు, ఇంగ్లీషు వచ్చని చెప్పుకోవటానికి'', అంటాడుట బావ. లలితకి ఇంగ్లీషు పుస్తకాలు చదవాలని, మంచి భాష నేర్చుకోవాలని ఎంతో కుతూహలంగా ఉండేది. ఈ అపహాస్యాలకి క్రుంగిపోయేది.

''ఒకరికోసం, గొప్పకోసం పనులు చెయ్యటం నాకలవాటు లేదు'' అని పేపరు పడేసి వెళ్ళేదిట.

ఎక్కడికైనా స్నేహితుల ఇళ్ళకి వెడితే బావకి కోపంట. అది ప్రదర్శిస్తాడు. కాఫీ ఇస్తే ''అక్కడ పడెయ్యి'' అంటాడుట. ''చల్లారి పోతుంది'' అంటే, ''నీకు బాధ ఎందుకు?'' అంటాడుట. లలితకి కళ్ళలో నీరు తిరుగుతాయి. అక్కయ్య కుసుమంలాగ మెత్తనిది; బావ వజ్రంలాగ కఠినమైనవాడూను.

ఎంతో ఆదర్శంగా ఉండాలనుకున్నాను. ఇంత చిన్నపిల్లతనంగా, అసూయగా ప్రవర్తిస్తారేమిటి?'' అని బాధపడుతుంది లలిత.

పన్నెండవయేటనే వీణ మొదలుపెట్టింది లలిత. పెళ్ళినాటికి బాగా వాయిస్తుందని పేరు తెచ్చుకుంది. పెళ్ళిచూపులలో పాడించారు. పెళ్ళిలో చిన్న కచేరీ జరిపించారు. కాని బావ ఎప్పుడూ వీణ వాయించమని అడగడుట. ''నా స్నేహితురాళ్ళు వస్తే కొంచెంసేపు సరదాగా గడిపే వాళ్ళం. ప్రాణం లేచి వచ్చినట్లుండేది గిరిజవస్తే, ఆ అమ్మాయి వెళ్ళగానే, ''అప్పుడే వెళ్ళిపోయిందా,

ఇవేళ నాకు భోజనం ఉండేదనుకున్నాను. ఈసారి నువ్వు మీయింటికి వెళ్ళినప్పుడు ఆ వాయిద్యాన్ని అక్కడ పడేసిరా'' అనేవారు. వీణను గురించి అంత నిర్లక్ష్యంగా మాట్లాడటం, నేను సహించలేకపోయేదాన్ని. భోజనం, నిద్రతో తృప్తిపడలేముకదా''.

''మనం ఏ పనిచేసినా దానివెనక ఆత్మ సంస్కారం కనిపించాలి. వాళ్ళ తాతగారు వేదాంతి అని, ఏవో గ్రంథాలు రాశారని చెప్పారుకదు నాన్నా! వీరిలో ఆ వాసనలేమీ కనిపించవు. భార్య అంటే జీవిత భాగస్వామిని అని ఆయనకు తోచదు. వేళకి తనకు సదుపాయాలు అమరించే సేవకురాలు వారి దృష్టిలో. నాకు ఆశయాలు, భావాలు ఉంటాయనే తలంపు లేనేలేదు. ఈలోకంలో నేను కోరుకునేది చీరలు, నగలు మాత్రమేనని ఆయన అభిప్రాయం. అది నేను సహించలేను. నేను క్లబ్‌కి వెళ్ళటం ఆయనకి ఇష్టంలేదు. ఏలోటూ చేసేదాన్ని కాదు. వంటచేసి, మళ్ళీ భోజనం వేళకి వచ్చేసేదాన్ని. అయినా ఆయనకి అకారణంగా కోపం. నెపాలు వెదకి నామీద కసి తీర్చుకునేవారు. ఎక్కడికైనా వెళ్ళి వచ్చాక

''భోజనానికి రండి'' అంటే

''నాకు ఆకలి లేదు. నువ్వు వెళ్ళి తిను'' అనేవారు.

కోపం అందుకేనని తెలుసు కనుక, ఏమీ తోచకపోతే వెళ్ళాను. మీరు మాత్రం స్నేహితులతో వెళ్ళారు. ఒక్కతెను తోచదని....

''నాతో వంతు అన్నమాట. అయినా స్త్రీ స్వాతంత్ర్యం. వద్దంటే మానతారా? నేనెందుకు వద్దంటాను?''

వద్దనరు కాని ఈ ప్రవర్తనతో వేధిస్తారు.

ఎందుకు వెళ్ళానా అనిపిస్తుంది. ఇట్లా నన్ను ఏడిపించటం సరదాకి కాదు. కోపిష్టి స్వభావం, మనసులో నామీద ద్వేషం కాబోలు ననిపిస్తుంది. ఇంక భోజనానికి కూర్చున్నాక,

''కూర బాగా ఉడకలేదు. వ్యవధి లేకపోయింది కాబోలు. మజ్జిగ ఇట్లాగ తోడుకుందేం? పాలు సమంగా కాచలేదా? ఇంటి పనులంటే శ్రద్ధ ఉంటే కదూ. చదువుకున్నదానివి మరి''.

ఆయన భోజనం చేసేదాకా ముఖం చూపించేదాన్ని కాదు. ఎందుకంటే, కళ్ళనిండా నీళ్ళు, గొంతుక పూడి, మ్లానంగా ఉండేది. ఆయన వెళ్లగానే కంచం తీసి వరండాలో కూర్చునేదాన్ని. ఆయనతో మాట్లాడాలనించేది కాదు. ఆ మనిషిలో మృదుత్వమన్నది ఏ కోశానా లేదా? ఏమిటీ జీవితం? అందరి

సంసారాలు ఇట్లాగే ఉంటాయా? లేదు, ఎంతో సంతోషంగా ఉండేవాళ్ళని చూస్తుంటాము. పోనీ వాళ్ళని చూసైనా అనిపించదా? మరి ఇదీ అజ్ఞానమా, నా అదృష్టమా?'' అని ప్రశ్నించుకునేదాన్ని.

''లలితా!'' అని ఆయన పిలిచేవారు.

ఎందుకో వెళ్ళి నేను కనుక్కోవాలి. చీకటిలో నా చెంపలమీద నీరు కారుతుందేమో చూడటానికి వారు రారు. వెళ్ళకపోతే నేను పొగరు కలదానిని. వెళ్ళి నేను గుమ్మంలో నుంచుంటే పక్కమీద పడుకుని ''ఈ తమలపాకులు ఈనెలు తీసి యిమ్మని నేను రోజూ చెప్పాలా?'' అంటారు. తమలపాకులు అందుకుంటూ

''ఏమిటట్లా దిగాలుపడి ఉన్నావ్. నిన్నేమన్నానని, నీ యిష్టం వచ్చిన చోటికి వెళ్ళు. వద్దనను. చీరకోసమేమిటి ప్లాన్? రేపు తెచ్చి పెడతాలే; ఇప్పుడు మాత్రం అలుక మానేసెయ్యి'' అంటారు. నేను లొంగిపోక తప్పదు.

సర్వం అర్పించి, ఆనందం సృష్టించుదామనే దివ్యసంకల్పం నాదయితే, భార్య అనేదానికి మనసుందని, తన జీవితానికి విలువ యిస్తుందని, అతని ప్రవర్తనుబట్టి ఆమెకు సుఖదుఃఖాలు కలుగుతాయనే ఆలోచనే ఆయనకి లేదు. ఏమి చేయను నేను?'' అని ప్రశ్నిస్తుంది లలిత.

ఔను, కన్న తల్లిదండ్రుల్ని వదిలి, పెరిగిన ఇల్లు వదిలి, మనసులో ప్రేమ నింపుకుని ఆత్మార్పణం చేస్తుంటే అతను చూడవలసిన తీరు ఇదేనా?

అసలు ఆడపిల్లలు తాము పుట్టి పెరిగిన పరిస్థితులు వదిలి, అలవాట్లను ఎందుకు మార్చుకోవాలి? కొంతవరకు మగవాళ్ళుకూడా సర్దుకుపోవచ్చుగా. పూర్తిగా మారిపోవాలంటే, ఆ నూతన వధువుకి బాధ కలుగుతుందనైనా బావలాంటి మనుష్యులు గ్రహించలేరే. బావకి అమితమైన కోపంట! కథలో ఎక్కడైనా రాజకుమారి మీద రాజకుమారుడు కోపగిస్తాడూ? రాకుమారి నిద్రలేవటం ఆలస్యమయి సూర్యుని లేత కిరణాలు ఆమె వదనం మీద ప్రసరిస్తుంటే ఆ బంగారు వెలుగులో ఆ పద్మనయనాలు ఏ వింత సొగసులతో వికసిస్తాయా అని ఎదురుచూస్తుంటాడు సౌందర్య పిపాసి!

''ఇంత ఆలస్యంగా లేస్తే కాఫీ ఎప్పుడు చేస్తావ్? అంత మొద్దునిద్దరా?''

అని బావ తను లేవకుండానే మేల్కొలుపుతుంటే రాజకుమారి మనసు మొద్దుబారిపోదూ.

''పెళ్ళినాటికి మనసులో ఎంత అనురాగం ఆర్ద్రతా ఉన్నాయో, ఇక్కడికి వచ్చేటప్పటికి అంత వైరాగ్యం, విరక్తి నిండుకున్నాయి ఆ స్థానంలో. ఆయనకు

నేనంటే కొంచెమైనా గౌరవం లేదు. అతని అనురాగానికి ముగ్ధురాలినవుతానని కాని, అతని నిర్లక్ష్యానికి దుఃఖమయినౌతానని కాని అతనికి ఏమీ తెలియదు. అటువంటి పాషాణుడి కాళ్ళదగ్గర పడేసి సుకుమారమైన నా జీవిత కుసుమాన్ని ఎందుకు నలిపేయనివ్వాలి? అంతకంటే దేవుడి పూజ కర్పిస్తే పవిత్రత లేదూ! దేశానికర్పిస్తే సార్థకత లేదు!'' అంటుంది లలిత.

అందుకే నాకు పెళ్ళిమీద నమ్మకం లేదు. కన్నెపిల్లలకు అది తీయటి కల! కాని, ఎటువంటి వాడైనా, కోరి చేసుకున్న పిల్ల అయినా సరే, భార్య అయేటప్పటికి అధికారభావంతో చూస్తాడు. బి.ఎ. పూర్తి చేస్తాను. యమ్మే చదువుతాను. ఉద్యోగం చేస్తాను. స్త్రీ సహజమైన వాంఛలు ఉండనీ, సబ్లిమేట్ చేస్తాను. సంగీతసాధన చేసి కళారాధనలో తపస్వినినౌతాను. నా అందం, నా పాట, నా చదువు ప్రస్తుతం ఎవ్వరైనా ఆరాధించవచ్చు. కాని ఆ వివాహమే జరిగితే ఆ బాధ్యతల్ని బట్టి అతను కూడా అందరిలాగే ప్రవర్తిస్తాడు. నా కల చెగిగిపోతుంది. ఈ జీవిత రాగాలాపనలో అది అపశ్రుతి అయితే నా బాధ వర్ణనాతీతం ఆరోజు సాయంత్రం. క్రిందటి సంవత్సరాదికి సత్య వచ్చింది.

''నేనూ సుధతోపాటు మళ్ళీ వీణ సాధన చేస్తున్నానే సత్యా! రాత్రి మేమిద్దరం వాయిస్తాము. నువ్వు పాడాలి'' అంది లలిత.

ముగ్గురం కొత్త చీరలు కట్టుకున్నాం. తలలో మల్లెలు, నింగిలో నక్షత్రాలు అమ్మ, నాన్నా, చెల్లాయి, తమ్ముళ్ళు శ్రోతలు... వీణమీద సరిగమలు... సత్య కంఠంలో మధురిమలు. ఎంతో ఆనందంగా ఉంది. నాన్న ''బంగారు తల్లులు'' అన్నారు. పులకిస్తూ వీణ క్రింద పెట్టాను. సత్య రాణిని వొళ్ళోకి తీసుకుని ముద్దు పెట్టుకుంది. లలిత చరాలున లేచి లోపలికి వెళ్ళింది. వెనకే వెళ్ళాను. పక్కమీద పడుకుని ఏడుస్తోంది. ఏమనను? ఎవరు ఓదార్చగలరు? కిటికీ దగ్గర నుంచున్నాను. ఒక ప్రాణి దుఃఖం ప్రపంచమంతటా ప్రతిధ్వనిస్తుంది, అనిపిస్తుంది.

బావ వస్తున్నానని రాశాడు. ఈ ఐదేళ్ళు అతను జీవితం ఎట్లా గడిపాడో మాకు తెలియదు. లలిత బి.ఇడి అయి, ఏడాదినుంచి టీచర్‌గా ఉద్యోగం చేస్తోంది. ఇన్ని ఏళ్ళు కష్టపడి చదువు, సంగీతం సాధించి, బావ రమ్మంటే ఇప్పుడున్న స్వేచ్ఛ వదులుకుని ఆ వెనకటి జీవితంలోకే వెళ్ళిపోతుందా?

ఈ పాత కథలన్నీ అక్కయ్యకి కూడా గుర్తు వచ్చి ఉంటా'' యనుకుంటూ లోపలికి వెళ్ళాను. సరిగ్గా ఆ ప్రశ్నే అమ్మ లలితని అడుగుతోంది.

అతను రమ్మంటాడేమో! లేకపోతే ఎందుకు వస్తాడు'' అని.

లలిత రాత్రి వంటకి కూర తరుగుతోంది.

''రమ్మంటే వెడతానమ్మా!'' అంది దృఢంగా.

''బాగా ఆలోచించుకున్నావా?''

లలిత ముఖంలో ఆనందం లేదు. ఆలోచనగా, నిశ్చయించుకున్నట్లుగా ''ఆ'' అంది. ఎంత గాంభీర్యం అనుకున్నాను.

''అంతేనమ్మా ఆడపిల్లల సంగతి. మరి ఇదంతా ఈ చదువు, ఈకష్టం..... '' అమ్మకి లలిత వెళ్ళటం ఇష్టం లేదేమోననుకున్నాను.

''రావలసిన మార్పు ఏదో నాలో వచ్చింది. ఆయన కూడా మారితే సంతోషం. కాకపోయినా నేను వెళ్ళక తప్పదు''

''బావ ఇదివరకులాగ సంకుచితంగా ఉంటే, నువ్వు ఉద్యోగం చేస్తున్నావని నీ మీద దురభిప్రాయంతో ఉంటే వెడతావా? మరి నువ్వు ఈ ఐదేళ్ళలో సాధించింది ఏమిటి?'' అన్నాను.

అక్కయ్య ఏ కాంతీ లేకుండా నవ్వుతూ,

''జీవితాలకి అర్థం లేదే సుధా! ఏదో ఈ జీవితాన్ని కన్నీళ్ళతోనో, మనసుకి గాయాలతోనే ఒకరిసేవ కింద గడిచిపోనీ'' అంది.

యూనివర్సిటీ ప్రైజులు తెచ్చుకుంది. రేడియోలో పాడింది. నలుగురిచేత తెలివైందనిపించుకుంది. అటువంటి లలితేనా ఇంత జాలిగా మాట్లాడింది, అని నాకు కష్టం తోచింది. ఇది ఆడవాళ్ళలో బలహీనతా, లేక, గొప్పతనమా?

ఐదు సంవత్సరాల తరువాత మాటలు, చూపులు లేకుండా కలుసుకోవటం.

బావ వచ్చాడు. నాన్నకు ఉండే ప్రశాంతతే ఇంట్లో అందరినీ ఆవరించింది.

లలిత అంత శాంతంగా ఉండటం చూసి నాకు ఆశ్చర్యం కలిగింది.

బావ రాగానే నాన్న అడిగారు ''కులాసాగా ఉన్నావా?'' అని.

తువ్వాలుతో ముఖం తుడుచుకుంటూ, నుదుటిమీద పడే జుట్టును పైకి తోస్తూ, ''ఆ'' అన్నాడు బావ.

లలిత భావసంఘర్షణలేమీ తెలియరాకుండా, ఆకాశంలోకి చూస్తోంది దూరదూరంగా.

''లలిత స్కూల్ టీచర్‌గా పనిచేస్తోంది'' అన్నారు నాన్న.

''నాకు తెలుసు'' అన్నాడు బావ.

మాకు అర్థమయింది, ఇక్కడి సంగతులన్నీ బావ తెలుసుకుంటూనే ఉన్నాడని. అమ్మ భోజనానికి లెమ్మంది.

''లలితను తీసుకు వెడదామని వచ్చానండి'' అన్నాడు బావ. అమ్మ మాట్లాడలేదు.

''లలితకి రావటానికి అభ్యంతరం లేదోయ్. నువ్వే అడుగు'' అన్నారు నాన్న.

అక్కయ్యకి ఆపుకున్నా కన్నీళ్ళు వస్తున్నాయి. ''ఆయన మనసు చాలా మెత్తనిదమ్మా. ఆ కోపం, సంకుచిత భావాలు మరుగుపడి పోయింది. దానిని చూశాను కాని, తీయలేకపోయాను. నన్ను క్షమించ వచ్చా అనిపిస్తుంది'' అంటోంది అమ్మతో.

''ఏమైతేనేమమ్మా! నీ కాపురం కుదుటపడింది. అంతకంటే నాకు ఏం కావాలి లలితా!' అంది అమ్మ.

ఆ మరునాడు లలిత చెప్పిన దానినిబట్టి అక్కయ్యకి, బావకి మధ్యన జరిగిన సంభాషణ నీవిధంగా ఊహించుకుంటున్నాను.

అక్కయ్యను చూసి ''రా, కూర్చో'' అన్నాడు బావ.

లలిత బావ పడుకున్న మంచం దగ్గర ఒక కుర్చీలో కూర్చున్నది.

''నీకు నాతో రావటానికి అభ్యంతరం ఉండదు కదు లలితా'' అన్నాడు.

అక్కయ్య ఉండదన్నట్టు తల ఊపింది మౌనంగానే.

బావ ఇటువైపు తిరిగి పడుకుని లలిత ముఖంలోకి చూస్తూ,

''మరి ఈ ఐదేళ్ళలో నీ సంగతులన్నీ నాకు తెలుస్తూనే ఉన్నాయి. నా సంగతులేమైనా నీకు తెలుస్తున్నాయా?'' అనడిగాడు.

''క్రిందటి 'వింటర్'లో మీరు ఉత్తర దేశయాత్రకి వెళ్ళినట్లు ఎవరో చెప్పారు''.

చప్పున లలిత పాణిని తన చేతిలోకి తీసుకుంటూ బావ,

''నేను ఎవరూ లేనివాడినికదా, నామీద కోపగించి వచ్చేస్తే నన్ను ఎవరు చూసుకుంటారనుకున్నావ్ లలితా! నీకు మీ అమ్మావాళ్లున్నారు, నాకెవరున్నారు?''

లలిత కళ్ళలో నీరు నిండుకుంటోంది.

'అన్నయ్య దగ్గరకు వెళ్ళాను ఒకసారి. వదిన అడిగింది లలిత ఎప్పుడు వస్తుందని. 'ఏమో నాకు తెలియదు. ఇంక రాదేమో అన్నాను. ఎందుకు రాదు. ఏమిటి పరిహాసం అంది వదిన. అందరికీ పరిహాసమయితే నాలో అది పరివర్తన.

నీకు గుర్తుందా లలితా నువ్వు వచ్చే ముందు ఏం జరిగిందో?''

అక్కయ్య మాట్లాడకుండా వింటోంది.

మీనాన్న మన ఇద్దరినీ పండగకి రమ్మన్నారా?

'మీ నాన్న క్రిందటిసారి కూడా ఏమీ ఇవ్వలేదు. ఈసారి వాచీ ఇమ్మను. వస్తాను' అన్నాను నవ్వుతూ.

'పండగకి రావటానికి మీకు లంచం కావాలన్నమాట'' అన్నావు. పండుగకి ఇంటికి వెడతామని సంతోషంగా ఉన్న నీ ముఖంలో క్రోధఛాయలు ఆవరించుకున్నాయి.

''ఔను'' అన్నాను ధీమాగా.

''ఊహు మానాన్న ఇవ్వరు, నేను ఇమ్మని చెప్పను. మా మనసుల్లోంచి మీకు పిలుపు వినబడి వస్తే రండి పండగకి మాకు తోచినది ఇస్తాము'' అన్నావు.

నీ చేత ఎంతో అవమానం కలిగినట్లు క్రోధావేశం కలిగింది నాకు, బ్రతిమాలే బదులు ధిక్కరించావని, రైలులో ఎక్కేదాక నువ్వు మాట్లాడలేదు. మీనాన్న వచ్చారు తీసుకు వెళ్లటానికి, సెలవు దొరకలేదన్నాను. ఆఖరుగా నువ్వు అన్నమాటలు నాకు గుర్తున్నాయి.

''నాకేమిటో అసంతృప్తిగా ఉంది. కొన్నాళ్ళు మా అమ్మదగ్గర ఉంటాను. మీలోనో, నాలోనో మార్పు రావాలి. అప్పటికి మీరు నా బాధని అర్థం చేసుకుంటే నేను కోరుకునేది మళ్ళీ మీ దగ్గరకు రావాలనే.''

''నీకు కళ్ళల్లో నీళ్ళు ఎందుకు వస్తున్నాయి లలితా'' అన్నాడు బావ. లలిత మాట్లాడలేదు. కంఠం మాట్లాడనివ్వటంలేదని బావకి కూడా తెలుసు. అక్కయ్య చేయి బావ చేతిలోనే ఉంది. లలిత కన్నీళ్ళు తుడుచుకుంది.

''ఇప్పుడు నాతో రావడానికి నీకు అభ్యంతరం ఎందుకు లేదు?'' ప్రశ్నించాడు బావ.

''నేను మారాను. మీరు ఎట్లాగ ఉన్నా నా ధర్మం నేను ఆచరిస్తాను? ఇంతకాలం గడిచింది కాని జీవితానికి అంతకంటె అర్థం గోచరించలేదు నాకు'', అంది లలిత.

బావ సన్నగా నవ్వుతూ, ''లేదు లలితా, నేను ఒప్పుకోను. నువ్వు చేసే ఈ త్యాగాన్ని నేను భరించలేను. నేను మారాలని చెప్పి వచ్చావు. నేను

మారినట్లు కనిపిస్తేనే రా. నీ ధర్మం విధిగా నిర్వహిస్తానంటే, అంతకంటె నువ్వు ఇక్కడే ఉండిపోవటం మంచిదంటాను'' అన్నాడు. అక్కయ్య నవ్వింది.

''మీరు మారారు. మీరు ఇక్కడికి వస్తానని వ్రాసినప్పుడే ఆ సంగతి నేను తెలుసుకున్నాను. అయినా మీతో రావటానికి సిద్ధంగా ఉన్నాను. ఈ ఐదేళ్ళలో సంగీత సాధన చేశాను. ఎక్స్‌కర్షన్లకి యాత్రకి వెళ్ళాము. సోషల్ సర్వీస్ కాంప్స్‌లో పాల్గొన్నాను. ఎన్ని సరదాలున్నా జీవితాన్ని గురించి జిజ్ఞాస తీరలేదు. తృప్తి లేదు. జీవితానికి అర్థం లేదు. వేధించేది. అటువంటప్పుడు జీవితానికి ఒక ప్రయోజనం కల్పిస్తూ, ఎవరి భార్యగా గుర్తించబడ్డానో వాళ్ళ దగ్గరే నా జీవితం గడిచిపోతే అదొక తృప్తిగా ఉంటుంది కదూ''.

''అంత వైరాగ్యమా, కాని నువ్వింత స్వార్థరహితంగా నాకు సేవ చేస్తానంటే నేను స్వీకరించలేను లలితా. నువ్వు ఇదివరకు నాలో ఏ వ్యక్తిత్వం కోరుకున్నావో దానిని ఏమైనా నువ్వు చూడగలిగి నీ మనసు ఆనంద ప్రపూర్ణమైతేనే నాతో రా....'' అన్నాడు బావ.

లలిత లేచి బావ తలవైపు కూర్చుంది. ఒక ఆనందాతిశయాన్ని అనుభవిస్తూ,

''మీరు ఇంత సున్నితంగా మాట్లాడటం ఎక్కడ నేర్చుకున్నారు? ఈ ఐదేళ్ళు ఎట్లా గడిపారో నాకు చెప్పరూ?'' అంది.

'చెప్పకపోతే ఈ ఐదుసంవత్సరాల మధ్య దూరాన్ని సన్నిహితం చెయ్యటమెట్లాగ చెప్పు. కథ ఏమీలేదు లలితా! నువ్వు వెళ్ళాక నాకు తోచేది కాదు. నిన్ను గురించి ఆలోచిస్తుండేవాడిని. నీకు తెలియదు లలితా! నాకు మొదటినుంచి నీమీద చెప్పలేనంత మమకారం ఉంది. కాని అది వెల్లడి అయ్యే అవకాశం నేనివ్వలేదు. మా అమ్మ నాకు గుర్తుంది. మా వదినను చూస్తున్నాను. అన్నయ్య వదినని అట్లాగే చూస్తాడు. వదిన ఏమీ పట్టించుకోదు. నవ్వుతూనే ఉంటుంది. మా అమ్మకి వంట, సంసారం తప్పితే ఇంకొక తాపత్రయం ఉండేది కాదు. ఆడవాళ్ళను గురించి నాకంతకంటే అభిప్రాయాలు లేవు. నీవు ఎంతో బాధపడ్డావు కదూ.

నువ్వు వెళ్ళిపోతే నాకెందుకు అంత తోచకపోవటం? మళ్ళీ నువ్వు రావనుకుంటే బాధ తోచటం. నువ్వు ఇంటర్ పరీక్షలకి వెళ్ళావని విన్నప్పుడు చాలా కోపం వచ్చింది. ఇక మన సంబంధం విడిపోయినట్లే అనుకున్నాను. కాని ఆలోచనలు నిన్ను వదిలివచ్చేవికావు. నీవు వెళ్ళిపోవటానికి తగిన కారణం

కనిపించేదికాదు. నీ వస్తువులు చూస్తుండేవాడిని తోచక పుస్తకాలు చదవటం మొదలుపెట్టాను.

చదివిన కొద్దీ ఏదో కొత్త ప్రపంచంలోకి వెళ్ళినట్లు కుతూహలం ఎక్కువయింది. రెండు సంవత్సరాలు పుస్తకం విడవకుండా కనిపించిన ప్రతి పుస్తకం చదివాను. మనుష్యుల్లో కలిసి తిరగటం లేదని అప్పుడందరూ చెప్పుకొనేవారు. నువ్వు వెళ్ళిపొయ్యావని నాకు విరక్తి కలిగిందని, నీమీద అభిప్రాయాలలో మార్పు ఎప్పుడు వచ్చిందో, ఎట్లాగ వచ్చిందో తెలియదుకాని, నువ్వు బి.ఎ. పాసయ్యావని విన్నప్పుడు నాకు సంతోషమే కలిగింది. ఔను ఉన్నతిని కోరుకోవటం, ఆనందాన్ని వెతుక్కోవటం మనిషిలో ఉత్కృష్టమైన గుణాలు. నీలో ఉన్న విశిష్టతను నేను గుర్తించలేకపోయాను. అది ఒక అంధకారం.

నీవు వెళ్ళిపోయాక కలిగినలోటు తెలిసినప్పుడు నీవు నాకెంత ముఖ్యమైన దానివో అర్థమయింది. అటువంటి నీమీద నేను తీసుకున్న శ్రద్ధ, చూపించిన ప్రేమ తలుచుకుంటే నాకు సిగ్గువేసేది. చాలా బాధగా ఉండేది. మళ్ళీ మనం కలుసుకోగలమా అని ఆలోచించేవాడిని. నీవు చాలా మెత్తనిదానివని నాకు తెలుసు. ఏడాది నుంచి నిన్ను తీసుకు వెళ్ళడానికి... కాని జాతక ప్రకారం ఈకాలం అనుకూలంగా ఉంది''.

''జాతకాలు కూడా నేర్చుకున్నారా?''

''ఊ, లిటరేచర్, ఫిలాసఫీ, ఎస్ట్రానమీ అన్నీను. ఏం భయం వేస్తోందా?''

లలితకూడా నవ్వుతూ ''మీరు మళ్ళీ పెళ్ళి చేసుకుంటారని విన్నాను'' అంది.

''విన్నావేమోకాని, ఎంత సంస్కారం లేకపోయినా అంత హీనమైన బుద్ధి పుట్టలేదు నాకు. నీమీద తప్ప నాకు వేరే ఆలోచనలు లేవు లలితా'' అన్నాడు బావ.

లలిత అప్పుడు గంభీరంగా 'ఆమాటకి వస్తే మీ అంత ఉదారమైనదానిని కాదు నేను. మీకంటె నాకేదో వ్యక్తిత్వం, సంస్కారం ఉన్నాయని, మీకంటె ఎక్కువదాన్ని అనే అతిశయం ఉండేది నాకు. అదంతా అజ్ఞానం కదా అని నాకు చింత కలుగుతూంది'.

'అజ్ఞానం కాదు లలితా! స్త్రీ యెప్పుడూ తన భర్త అన్నింటిలో తనకంటె అధికుడు కావాలని కోరుకుంటుంది'' అన్నాడు బావ.

బావ నుదుటిమీదపడే జుట్టును వ్రేళ్ళతో సర్దుతూ అంది లలిత.

''నన్ను క్షమించండి''

''ఎందుకూ'' అన్నాడు బావ.

''ఏమో నాకు తెలియదు'' అంది లలిత.

''ఇప్పుడు నా అంత అదృష్టవంతురాలు లేదనిపిస్తుంది. ఇంతవరకూ నాజీవితం సుఖాంతం అవుతుందనే ఆశ నాకుండేది కాదు. ఇట్లాగ విడిపోయిన వాళ్ళంతా తిరిగి కలుసుకుంటున్నారా అమ్మా?'' అంది లలితక్కయ్య.

ఆరోజు బావతో అక్కయ్య వెళ్ళిపోతోంది. చాలామంది చూడడానికి వచ్చారు. అక్కయ్యకి చీర, పసుపు, కుంకుమ ఇస్తుంటే అమ్మకి కళ్ళలో నీరు తిరిగింది. పక్కింటి పిన్నిగారు,

''మళ్ళీ ఇన్నాళ్ళకి అమ్మాయి తన ఇంటికి వెడుతోందమ్మా. సంతోషించ వలసిన సమయమిది. అంతా అమ్మాయి అదృష్టం, అల్లుడి మంచితనమునూ'' అంది.

సంతోషించవలసిన సమయమైనా అందరి హృదయాలు బరువుగా వున్నాయి.

''మళ్ళీ నుదుట కళ్యాణం బొట్టుతో నిన్ను చూడటానికి నీ పెళ్ళికి వస్తానే సుధా!'' అంది అక్కయ్య.

''అంతవరకూ రాకుండా ఉండగలవా అక్కయ్యా! కొన్ని ఏళ్ళు పడుతుందేమో!'' అన్నాను.

''ఏం రిసెర్చి చేస్తావా, ఫారిన్ వెడతావా?' అన్నాడు.

''అది కోరినవాడు దొరకవద్దూ'' అన్నారు నాన్న నవ్వుతూ.

''నువ్వు కూడా మీ అక్కయ్యలాగ షేప్‌లెస్ బ్రెయిన్‌ని చేసుకో. నీకు కావలసినలాగా దిద్దుకుందువుగాని'' అన్నాడు బావ.

''బ్రెయిన్ అంటే మట్టిముద్ద కాదు బావా! అయినా మా అక్కయ్య నిన్నేమీ దిద్దలేదు. నీఅంతట నీవే అప్రతిభుడవై పోయావు'' అన్నాను.

''ఇది యదార్థలోకమమ్మా సుధా! నీవు కలలుకనే మనిషి ఈలోకంలో లేకపోతే'' అన్నాడు బావ.

''రాజకుమారుడు రాకపోతే, ఋషికన్యలాగా ఉండిపోతాను బావా!'' అన్నాను.

''రాజకుమారుణ్ణి నేను వెదికి తెస్తాను'' అన్నాడు బావ బండి యెక్కుతూ.

అందరి ముఖాలు హాసప్రపుల్లాలయ్యాయి.

''అక్కయ్యకి రాజకుమారుడు దొరికాడు' అనుకున్నాను నేను.

ఆంధ్రవారపత్రిక, 14-10-1959

* * * *